ఒక ప్రాంతమే, రాయలసీమలాంటి ఒక  భౌగోళికతనమే కథా ప్రొటాగనిస్ట్‌గా మారటం రెండో వీరగల్లు కథ. ఇది ఆంధ్రప్రదేశ్ విభజనానంతర కథాసంవిధానం. రాయలసీమ తనను తాను పరిశీలించుకుంటున్న కొత్త కథా సందర్భపు శిల్ప సంకేతం.

జి. వెంకటకృష్ణ

7

# రెండో వీరగల్లు





"ఈ వీరగళ్లును సిద్ధేశ్వరం చేరిస్తే మన కష్టాలు తీరుతాయంట మా తాత చెప్పినాడు. యీ వీరగళ్లును యేట్లోకేస్తాం రాండి?" కనిపించిన వాళ్లందరికీ చెప్తున్న పన్నెండేళ్ల పూజారి వీరేశ్‌ను అందరూ వింతగా చూస్తున్నారు.

"ఈ వీరగళ్లును సిద్ధేశ్వరం చేరిస్తే, అలుగులా నిలబడి నీళ్లన్నీ కిందికి పోనీకుండా ఆపుతాడంటా. అప్పుడు ఆ నీళ్లన్నీ మన పంటపొలాలకే... నిజంగా," అంటున్న ఆ పిల్లవాణ్ణి,

"అయ్యో యింత చిన్నవయసుకే యీ పిల్లోడు యిట్లా ఎట్లా అయినాడబ్బా, పూజారి నారాయణకు ఎంత కష్టమొచ్చెగదా," అనుకుంటున్నారు ఆ వూరివాళ్లు.

పూజారి నారాయణక్కూడా అంతా అయోమయంగా వుంది.

'యేంది వీడిట్లా అయినాడు... లక్షణంగా చదువుకుంటున్నోడు, సుగ్గికి యెలవారిన్నా పొద్దున్నుంచీ విచిత్రంగా మాట్లాడతా వుండాడే,' అని యెదారు చేస్తున్నాడు.

నాలుగు రోజుల కిందట వుపాధి పనుల బిల్లుల కోసం మండలం ఆఫీసుకు పోతున్నప్పుడు నేనూ వస్తా, నేనూ వస్తానంటూంటే, వచ్చి నువ్వేమి చేస్తావురా అన్నా వినకుంటే, వీరేశ్‌నూ తోలకపోయినాడు నారాయణ.

"సార్ సుగ్గికి యెలవార్నామ్... వుపాధి బిల్లు యింకా పడ్లేదు. తొందరగా యిస్తే ఖర్చులకన్నా వస్తాయి.," ఏపీఓనూ టెక్నికల్ అసిస్టెంట్‌నూ అడుక్కున్నాడు.

నారాయణనూ అతని వెంట వున్న వీరేశ్‌నూ వింతజీవుల్ని చూసినట్లు చూస్తూ, కొత్తగా వచ్చిన ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్‌ను, 'సుగ్గికి పోవడమంటే ఏందని,' అడిగాడు.

"సుగ్గికి పోవడమంటే, పంటలు బాగా పండే ప్రాంతానికో, పనులు దొరికే ప్రాంతానికో పోయి అయినకాడికి కూలిపనులతో అంతోయింతో సంపాదించుకొని వచ్చేది సార్..."

“ఏ ప్రాంతానికి పోతారు?”

“గుంటూరు దిక్కు చానామంది గుంపులు గుంపులు పోతారు సార్. మన ఆదోని ప్రాంతం నుంచీ యేటా పోతారు సార్. ఉగాది ముందు మూణ్ణెళ్లు పోయొచ్చి, ఉగాదికి వూరికొచ్చి పండగ చూసుకోని మల్లా జూన్‌దంకా పోతారు సార్. బెంగుళూరు దిక్కు పోయేవాళ్లూ వుంటారు...”

“మరి మన ఉపాధిపనులు చేసుకోవచ్చు గదా... యిక్కడే పనులు పెడు తున్నాం గదా...”

“సార్ మనం పనులు పెడుతున్నాంగానీ, ఒక్కో జాబ్ కార్డు మీద నూరు దినాలే గదా పనిస్తాం. ఆ తరువాత ఖాళీగా యెందుకుండాలని అనుకుంటారు. యీ నారాయణ నూరు దినాలు చేసేసి వేరే కార్డు మీదా కొన్ని రోజులు చేసి, యింగిప్పుడు సుగ్గికి పోతాన్నాడు. అంతేగదా నారాయణా?”

“అవుగదా సార్. ఎన్ని దినాలు పనిచేసినా నూరు, నూటిరవై మించి మీ దగ్గర కూలి పడుతుందా. అది గూడా యెనిమిది వారాలైనా బిల్లులియ్యలేదు. పోయినసారి చానా ముందుగానే సుగ్గికి పోయింటిమి. యీసారి మా యింటిదానికి పాణం బాగలాక లేటైపాయ. మళ్ల నా బిల్లులెప్పుడిస్తారు సారూ.”

“యేమప్పా పూజారి నారాయణ, అమరావతి కట్టేకే దుడ్లులేవ్... నీకీ వుపాధి దుడ్లు అంత ముఖ్యమైపాయెనా. రోంత వుండండీ తొక్కులాడొద్దండీ. మస్టర్లు యెక్కీనీకె కంప్యూటర్ ఆపరేటర్లు లేరు. రేయింబొగుళ్లూ ఎక్కిచ్చినా అయితా లేదు.”

“అట్లంటే యెట్ల సారూ...” అని నారాయణ గడిబిడీ చేస్తూంటే, ఫీల్డ్ అసిస్టెంట్ వుశేన్ పీరా, నారాయణ భుజమ్మీద చెయ్యేసి, బయటకు తీసుకొచ్చినాడు. బంకు దగ్గర మూడు టీలు చెప్పి, వీరేశ్ చేతికి ఒక కప్పు అందించినాడు. నారాయణకు అవసరం వుంది, పీరాను మింగలేక కక్కలేక, మిరమిరా చూస్తూ ఊదుకోని ఊదుకోని, టీ తాగుతూన్న కొడుకు నెత్తిమీద ఒకటిచ్చి, “యిట్లాజేస్తే యెట్లా పీరా సార్, సుగ్గికి పోవాలంటే, ఖర్చుకి లేవు,” అన్నాడు.

“అయ్యో నారాయణన్నో నా మాటినూ, నన్ను నమ్మూ దుడ్లూ రిలీజ్ అయితా లేవన్నా నువ్వు సుగ్గికి పోయి రాపో. నీ దుడ్లు ఎక్కడ పోవుగానీ...”

“ఆ హంద్రీనీవా కాలువలో నీళ్లిచ్చినట్లే వుంది సారూ మీరు దుడ్లు యిచ్చేది. లెట్రిన్లు కట్టుకోమంటిరి. పొలాల్లో గుంతలు పెట్టుకోమంటిరి. దుడ్లు మాత్రం అప్పు డొస్తాయి, యిప్పుడొస్తాయి అంటారు.”

“మన హంద్రీనీవా పొంగి పొర్లుతుందిలేన్నా. ఆడ పట్టిసీమనో వట్టిసీమనో కట్టిండ్లా... యింగిప్పుడు కృష్ణనీళ్లు ఎనిక్కెనిక్కి ఎక్కొచ్చి. శ్రీశైలం దాటుకోని మనూర్లకు వస్తాయిలేన్నా...” పకపకా నవ్వుతూ అంటున్నాడు పీరా.

“సుళ్లు కూతలొద్దు. నిజం చెప్పు సారూ... ఆడాడో పట్టిసీమ కడితే మనకు నీళ్లు వస్తాయంట గదా...”

“అయ్యో తిక్కమనిషీ, మీ బోయోళ్లంత ఆవేశం మనుషులు, అమాయకులు ఎవరూ లేరు. సూడూ... ఆడాడో కింద కడితే, పైకి నీల్లెట్లా ఎక్కొస్తాయన్నా. శ్రీశైలంకాడ నీళ్లు కిందికి పోనీకుండా ఆపితే, 854 అడుగులు నీళ్లు నిలబడితే అప్పుడు మనకు నీల్లొస్తాయిగానీ. అయినా శ్రీశైలం కాడ నీళ్లాపితే కరెంటు ఎట్లా మనకు అని, కరెంటు కోసమే అన్నట్లు, నీళ్లను సాగర్‌కు తోలుకుంటారు. వాళ్ల తెలివే తెలివి సూడీ... అయినా యిబ్బుడు తెలంగాణావాళ్లు రంగంలోకి దిగిరిగదా, వాళ్లు వూరికే వుంటారేమి. మన పోతిరెడ్డిపాడు గేటుకు నీళ్లు అందాలన్నా 840 అడుగులు నీళ్లు వుండాలి.”

“అంతేనంటావా... మన హంద్రీనీవా పారేది సుళ్లేనంటావా... మేము ఏటేటా సుగ్గికి పోక తప్పదంటావా. వానాలి వానెక్కా, నాకు రోజూ రెండు విచిత్రాలు కన్పిస్తాయి పీరాసారూ, మనూరి దిగువ దిక్కేమో హంద్రీ వంక పారుతుందా. వానాకాలంలో పొంగి నీళ్లను తుంగభద్రలో కలుపుతుంది. పైదిక్కేమో హంద్రీనీవా కాలువ అనంత పురం దిక్కు పోతుంటుందా. రెండింట్లో యాదాంట్లో యిన్ని నీళ్లున్నా మన బతుకులు బాగుండు.”

“ఏమోలే నీ కొడుకు కాలానికన్నా బాగుపడతామేమోలే.”

“ఏమో ఏం బాగుపడతామో. ఎంత కొట్లాడితే వుపాధి దుడ్లు యిస్తున్నారు మీరు. దీనికే యింత కొట్లాడితే. హంద్రీనీవా పారాల్లంటే యింగెంత కొట్లాడల్లా.”

“హంద్రీనీవా పారాల్లంటే, పోతిరెడ్డిపాడుకు నీళ్లు ఎక్కాలంటే సిద్ధేశ్వరం అలుగు కట్టాలన్నా. దానికోసం కొట్లాడాలన్నా...”

“మన జనాలు కొట్లాడలేరంటావా పీరాసారూ...”

“కొట్లాడే కాలమొచ్చిందిలేన్నా. నీతోపాటు నీ కొడుకు కొట్లాడుతాడు. ఏరా కొట్లాడుతావా. జై రాయలసీమ అంటావా?” వీరేశ్‌ను పట్టుకుని అడుగుతున్నాడు పీరా.

“పీరాసారూ మా ముత్తాత పత్తికొండ కోటకు కావలగాడంటా. మా ముత్తాత వీరేశ నాయకుడు, అందుకే వీనికి ఆ పేరు పెట్టినా... పేరైతే పెట్నాగానీ... వీణ్ణి గూడా యీసారి సుగ్గికి ఏసకపోతాన్నా,” నవ్వు ఏడుపూ కలగలసిన గొంతుతో చెప్తున్నాడు నారాయణ.

“వస్తాం సారూ... యాడన్నా దుడ్లు బుడుక్కోని, రాత్రికి రైలుకు యెలవారల్లా. మా వుపాధి దుడ్లు మా అకౌంట్లోకి వేయిచ్చు మర్సిపోకుండా,” అని వీరేశ్ చేయి పట్టుకొని, “రారా పోదాం,” అంటూ వాడి మొఖంలోకి చూశాడు. వాడిలో యేదో తేడా కనిపించింది.

మధ్యాహ్నానికి ఎక్కడివక్కడ సర్ది, వెంట తీసుకుపోవాల్సినవి మూటకట్టి, రాత్రి రైల్లో తినడానికి సద్ది కట్టుకున్నారు. వూళ్లో చెప్పాల్సిన వాళ్లకందరికీ చెప్పి వచ్చారు.

రాత్రి తొమ్మిదిన్నర లోపల ఆదోని చేరుకుంటే రైలు దొరుకుతుంది. అందు లోనూ వూర్నుంచి ఆటోలో పత్తికొండ పోవాలా, ఆడ్నుంచీ బస్ ఎక్కాలా. ఆనీపూనీ ఆటో ఎక్కాలకు, మబ్బులు కమ్ముకున్నాయి. ఆటో హంద్రీ కాడికి వచ్చాళకు బీభత్సంగా గాలి పట్టుకుంది. యర్రదుమ్ము చుట్టుకుంది. ఆటో వూగి వూగిపోతోంది. పటాపటా యింతింత చినుకులు రాలబట్నాయి. గాలివాన హోరున కురవసాగింది. తడసి ముద్దైపోయారు. కమ్ముకుంటున్న చీకటిలో దూరంగా పిడుగు పడి మెరిసింది. అంత వర్షంలో ఆటో ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా తిరిగి స్టార్ట్ కాలేదు. నారాయణ పెళ్లాం బిడ్డలతో వంక గడ్డన పాత గుడి మండపంలో నిలబడినాడు. వంక మెల్లగా పారుతున్నది. ఆశ్చర్యంగా అప్పటికప్పుడే వేగం పెరుగుతోంది. ఎలాంటి వంక అది. ఒక్కసారిగా పొంగి వురుకులు పరుగులూ తీస్తుంది. దినం మధ్యాన్నానికి చుక్క నీళ్లు లేకుండా మాయమైపోతుంది. ‘నంగనాచి జలతల్లి నిన్న రాత్రి ఎంతోటు పొంగెనన్నా, యిబ్బుడు సూడూ ఏమీ యెరగనట్టు వొట్టిపోయింది,’ అనుకుంటారు జనాలు. నారాయణ తండ్రులు తాతలూ అలాంటి పొంగులకు సాక్షులుగా నిలబడినవారే. యిబ్బుడూ నిలబడే వున్నారు, తట్టాబుట్టా చేతబట్టుకొని, తడసి ముద్దైపోయి, సామాన్లు చెల్లాచెదురైన తమ వారసత్వాన్ని చూస్తూ.

నారాయణ కొడుకు వీరేశ్‌కు నీళ్లలో యేదో కదులుతున్నట్లు అనిపించింది. రెండు మూడుసార్లు ఆ కదలికను చూసాక. “నాయనా నాయనా. ఆడ సూడూ. నీళ్ల మీద ఒగ తాత నడుస్తూన్నాడు. చేతిలో కత్తి వుంది నాయనా...” వెర్రిగా అరిచాడు.

అరె యెవరన్నా మనిషి కొట్టుకొనిపోతున్నాడా అనే అనుమానంతో... “యాడ్రా, యాడ్రా...” అని నారాయణ ఆత్రంగా అడిగాడు, అయినా చేతిలో కత్తి ఎందు కుందబ్బా అనుకుంటూ.

“అదిగో అక్కడ నాయనా...” అని వీరేశ్ చూపించిన వైపు నారాయణ చూశాడు. చీకటిలో గాలిలో, పల్లంలోకి దూసుకుపోతున్న నీటి ప్రవాహం మీద ఏమీ కనిపించడం లేదు.

ఆ రాత్రి ప్రయాణం ఆగిపోయింది. యింటికి చేరి, సంచులు యిప్పదీసి, సంసారాన్ని నేలమీద పరిచారు.

ఉదయం యింటి ముందు జనాలు చేస్తున్న సందడికి మెలకువ వచ్చింది. యేందబ్బా అనుకుంటా వాకిలి తీస్తే... యింటి ముందర తమ మారెమ్మ గుడి కట్టకు జనాలు ఎగబడి వుండారు. ఈ మారెమ్మ గుడికి నారాయణ వాళ్ల బోయ కుటుంబాలే పూజారులు. జాతరలు జరిగినప్పుడు, మొక్కుబడులు చెల్లించేటప్పుడూ వీళ్లే ఆ తంతులు జరిపించేది. వంశ పారంపర్యంగా వస్తున్న ఆనవాయితీ అది.

"ఏంది, ఏమైందన్నా... గుడిలో ఏమైంది," అంటూ నారాయణ జనాల్ని తోసు కుంటూ వెళ్తే కనిపించింది. గుడి కట్టకు ఆనించి వుందది. నిగనిగలాడుతున్న నల్లని విగ్రహం. మందంగా వున్న నల్లని రాతి మీద చెక్కిన శిల్పం. బలమైన శరీరం, తీక్షణమైన కళ్లు, పురితిప్పిన మీసాలు, తలపాగా, చేతిలో కత్తితో, యింకో చేయి అభయముద్రతో... రాత్రి పొంగిన వంక దీన్ని తేల్చింది. ఇసుక తవ్వకానికి వెళ్లిన ట్రాక్టర్ వాళ్లకి యిది కన్పించగా, పదిమందితో మోపించుకొని యిక్కడికి చేర్చారు.

"యిలాటి వీరగల్లులు వూరి వూరికీ వుండేవంటా. ఆ వూరి పాళెగాల్లో, ఆ వూరికే చెందిన వీరుడో, వూరికోసం పోరాడినవాడి గుర్తుగా, యిట్లా విగ్రహాలు ఏర్పాటు చేసేవాల్లంటా. కాలక్రమంలో కూలిపోయి, మట్టిలో కలిసిపోయి, ఏటి గట్టునో ఏట్లోనో పడివుంటాయి." జనాలు చెప్పుకుంటున్నారు. వూరు వూరంతా వీరగల్లును చూసి పోతున్నారు.

వీరేశ్ కూడా దాన్ని చూస్తూ, "నాయనా రాత్రి నేను చూసింది యీ తాతనే. నీళ్ల మీద నడిచింది యీ తాతనే." అరుస్తూంటే,

"అరే తిక్కనాకొడకా, యీ బండ నీళ్లలో పొర్లింటుంది లేరా," అన్నాడు నారాయణ.

"లేదు నాయనా కత్తి పట్టుకుని నీళ్ల మీద నడిచినాడు. నేను చూసినా..." వాదించాలని చూస్తూంటే, వాడి నెత్తిమీద ఒకటిచ్చి, "యింట్లోకి పో," అని గెదురు కున్నాడు నారాయణ.

వీరేశ్ దాన్ని చూస్తూ యింట్లోకి పోయి, కిటికీ కాడ నిలబడి చూస్తూన్నాడు. ఆ పగలు వచ్చి చూసి పోయే జనాలతో వాళ్లింటి ముందు జాతర జరిగింది.

రాత్రి అన్నం తిని వాళ్లక్క పక్కనే పడుకున్నాడు వీరేశ్. వాళ్లక్కను కరచుకొని పడుకోవడం వాడికి అలవాటు. మంచి అర్ధరాత్రి మెలకువ వచ్చింది. వీరేశ్ లేచి కూచున్నాడు, అక్క, అమ్మ, నాయనా గురకలు పెడుతున్నారు. కిటికీలోంచి చూస్తే,

బయట వెన్నెల కురుస్తోంది. కిటికీ దగ్గరకు వెళ్లి వీరగల్లును చూశాడు. ఆ శిలా విగ్రహం మీద వెన్నెల పడి మెరుస్తోంది. కాస్సేపటికి ఆ శిలలో కదలిక గమనించి, వీరేశ్ గుడి ముందుకు వచ్చాడు. మారెమ్మ గుడి వీరేశ్‌కు బాగా అలవాటు. వాడి ఆటపాటలన్నీ రేయింబొగుళ్లూ అక్కడే. వాళ్లమ్మకు వాడు యింట్లో కనపడకపోతే, గుడిలో వుంటాడులే అనుకుంటుంది.

అంతలో శిలలో నుండి వీరుడు బయటపడ్డాడు. వీరేశ్ అతన్ని గుర్తుపట్టి, చేతిలోని కత్తిని చూస్తూ, "నువ్వు ఎవరు తాత," అనడిగాడు.

"అరే! మనవడా, నేను మీ ముత్తాతను రా... వీరేశ నాయకుణ్ణి... మనం బోయ వీరులంరా..."

"ఎందుకు తాతా యిట్లయిపోయినావు... రాయిగా మారిపోయినావు..."

"మా కాలంలో ఈ వూరి మీద పడి దోచుకుంటున్న దొంగల గుంపును మేము తరిమికొట్టినప్పుడు, దొంగలగుంపు నాయకుడి తల తీసింది నేనేరా. నేను చనిపోయి నెంక వీరగల్లును చేసి పూజించినారు. నా సంగతి సరే. మీరేమిరా యీ గతి పట్టినారు. బతికేదానికి కన్నగసాట్లు పడతాన్నారే..."

"అవును తాతా... మాకు పొలమున్నా నీళ్లులాక అది పండదు. మా నాయనకు పనుల్లేవు. మాకేమన్నా సాయంజేయి తాతా..." దీనంగా అడిగాడు.

"యీడ హంద్రీ నీళ్లన్నీ యేమైపోతున్నాయి, తుంగభద్రలో పారే నీళ్లన్నీ ఎక్కడ పోతున్నాయి, పత్తికొండ కాడ పెద్ద చెరువు వుండాల గదా అది యెండిపోయిందా..."

వీరేశ్ తనకు తెలిసినకాడికి, పీరాసార్‌తో నారాయణ మాట్లాడిన మాటలు అర్థం అయిన కాడికి, తాతకు చెప్పి, సిద్ధేశ్వరం కాడ అలుగు కడితే మనకు నీళ్లు వస్తాయంట తాతా," అని చెప్పగలిగాడు.

"అయితే మనవడా నన్ను సిద్ధేశ్వరం చేరిస్తే నాయట్లా వీరగల్లులను కలిపి కుప్పేసి, సిద్ధేశ్వరం అలుగై నిలిచి చుక్కనీళ్లు కిందికి పోనీకుండా చేస్తా..." అన్నాడు.

"నువ్వు అట్లా చేస్తే ,అంతకంటే యింకేంగావల్లా తాతా. మా వూర్లల్లో రైతులందరూ బాగుపడతారు..." వీరేశ్ అంటూండగానే చంద్రుడు మబ్బుల చాటుకు పోవడంతో, వెన్నెల ఆరిపోయింది. వెన్నెల వెలుగు ఆరగానే, వీరగల్లు శిలగా మారింది. "అయ్యో తాతా, తాతా..." అంటూ అరుస్తూన్న వీరేశ్ అరుపులకు నారాయణ, అతని భార్య లేచొచ్చినారు.

"అరే యేందిరా యింత రాత్రి పొద్దు గుడిలోకొచ్చి అరుస్తున్నావు, కొంచెమన్నా భయం లేకుండా తిక్క నాయలా..." అంటే,

“నాయనా యీ రాయిలో వుండేది, మన తాతనే నాయనా... నాతో యింత సేపూ మాట్లాడినాడు...” వీరేశ్ అంటుంటే, నారాయణకు కంపరం పట్టుకుని,

“యేమే, వీనికేమో తిక్క పట్టినట్లుందే. యింట్లోకి తీసకపోయే ముందు,” భార్యతో అన్నాడు.

“లేదు నాయనా. నిజంగా యీ విగ్రహం తాతదే. తాతది గూడా నా పేరే. వీరగల్లు అయినాడంటా. తాతను సిద్ధేశ్వరం చేరిస్తే, డ్యామ్లో నుంచి నీళ్లు కిందికి పోనీకుండా కావలి కాస్తాడంటా. నాతో చెప్పినాడు. తాతను సిద్ధేశ్వరం చేరిస్తే మనకు పంటలు పండుతాయి నాయనా...” వున్మాదంగా చెప్తున్న వీరేశ్‌ను నారాయణ ఆందోళనగా చూశాడు.

కొడుక్కు యేమో అయ్యిందనే భయంతో వణికిపోయాడు. వీరేశ్‌ను భుజం మీదికి యెత్తుకున్నాడు. వీరేశ్ వొళ్లు వేడిగా అనిపించింది. కర్నూలు ఆసుపత్రికి తీసక పోవాల్సి వస్తుందేమో అనుకుంటా సతమతమైపోయాడు.

రాత్రి గడిచింది. వుదయం వీరేశ్‌కు నిజంగానే జ్వరం పట్టుకుంది. తాతను కలవరిస్తున్నాడు. వీరగల్లును సిద్ధేశ్వరం చేర్చాలని నారాయణను అడుగుతూనే వున్నాడు. ఆ కలవరింతలతో నారాయణకు మరింత భయం పట్టుకుంది.

అది మొదలు పూజారి వీరేశ్ వెన్నెల కోసం ఎదురుచూశాడు. వెన్నెల్లో తాత శిల నుంచి బయటకు వస్తాడనీ... తాతతో మాట్లాడాలనీ, నాయనకూ తాతను చూపించాలనీ... అనుకుంటున్నాడు. ఇప్పుడు వీరేశ్ మీద యింట్లో అందరూ నిఘా పెట్టినారు. వాడు అలా కదలగానే అక్కో, అమ్మో, నాయనో లేచి కూచుంటారు. నీకు మాత్రమే కన్పిస్తానని, తాత చెప్పిన మాట మరచిపోయి అందరికీ తాతను చూపాలని వీరేశ్ తెగ తాపత్రయపడి, నిరాశ మిగిలించుకుంటున్నాడు.

ఆ తర్వాత వూళ్లో కన్పించినవాళ్లందరికీ, “ఈ వీరగల్లును సిద్ధేశ్వరం చేరిస్తే మన కష్టాలు తీరుతాయంట. మా తాత అలుగై నిలబడి నీళ్లు నిలుపుదల చేస్తాడంట, యీ వీరగల్లు సిద్ధేశ్వరం చేరుస్తాం రండీ,” అని చెబుతున్నాడు.

విన్నవాళ్లు వింతగా, ‘అయ్యో యింత చిన్నవయసుకే యీ పిల్లోడు యిట్లా ఎట్లా అయినాడబ్బా, పూజారి నారాయణకు ఎంత కష్టమొచ్చా,’ అనుకుంటున్నారు.

“పోతిరెడ్డిపాడుకు నీళ్లు అందాలన్నా, హంద్రీనివాకు నీళ్లు రావాలన్నా సిద్ధేశ్వరం అలుగు కడితేనే. దానికోసం యీ వీరగల్లును సిద్ధేశ్వరం చేరుద్దాం రాండీ. అప్పుడుగానీ రావు మన పంటపొలాలకు నీళ్లు...” వీరేశ్ కన్పించినోళ్లందరికీ చెప్పిందే చెబుతున్నాడు. విన్నవాళ్లు,

"యేం నారాయణా నీ కొడుకు యింతలేడు, అబ్బుడే రాయలసీమ పిచ్చి పట్టుకుందే. పెద్దపెద్దోళ్లే సళ్లకుండారే, ఆ వూసే యెత్తకుండా పెద్దపెద్ద పదవులకు అమ్ముడుపోయి వూరుకుండారే. యిబ్బుడు సిద్ధేశ్వరం కాడ అలుగు కట్టనీకే యెట్లవు తుందబ్బా," అంటున్నారు.

పూజారి నారాయణక్కూడా అంతా అయోమయంగా వుంది. 'యేంది వీడిట్లా అయినాడు, లక్షణంగా చదువుకుంటున్నోడు. సుగ్గికి యెలవారిన్నాపొద్దున్నుంచీ విచిత్రంగా మాట్లాడతా వుండాడే,' అని యెదారు చేస్తున్నాడు.

ఊళ్లోవాళ్లు తన మాటలను నమ్మడంలేదనీ, నవ్వులాటగా చూస్తున్నారనీ వుక్రోషంతో వీరేశ్ ఒకరోజు మధ్యాహ్నం అందరూ చూస్తుండగానే, "మీరెవురూ యీ వీరగల్లును సిద్ధేశ్వరానికి చేర్చడానికి తోడు రాకుంటే, నేనొక్కణ్ణే మోసుకొనిపోతా," నంటూ రెండు చేతులా బలంపూని వీరగల్లును గాల్లోకి లేపినాడు. దాన్ని అక్కడ కూర్చున్న వూరివాళ్లు దిగ్భ్రాంతితో కళ్లింత చేసుకొని చూశారు.

క్షణాల్లో ఆ వార్త వూరు వూరంతా పాకింది. పదేండ్ల పిల్లవాడు అంత బరువైన శిలను ఎత్తడం అబ్బురంగా, మహిమాన్వితమైందిగా భావించారు. ఆ క్షణం నుండీ వీరేశ్ చెబుతున్నదాన్ని నమ్మడం ప్రారంభించారు. 'సిద్ధేశ్వరానికి వీరగల్లును ఎందుకు చేర్చగూడదు? యీ పిల్లోడు తనకోసం అడగడం లేదుగదా, మందికోసమే గదా,' అనుకోవడం ప్రారంభించారు.

నారాయణ కొడుకులో వస్తున్న మార్పుల్ని గమనిస్తున్నాడు. 'వీడు చెప్తుంది నిజమేనేమో... ఆ శిలలో వుండేది తన ముత్తాతేనేమో,' అనుకుంటున్నాడు. 'దాన్ని కృష్ణానదిలో వేసొస్తే తమ కరువు తీరుతుందంటే ఆ పని యెందుకు చేయగూడదూ,' అనుకుంటూ ఆ రాత్రి కొడుకును పొదుముకొని పడుకున్నాడు.

మరుసటిరోజు వీరేశ్ అందరూ చూస్తుండగానే వీరగల్లును గాల్లోకి లేపి భుజాని కెత్తుకున్నాడు. ఆ క్షణంలోనే వీరేశ్‌కు రెండు భుజాలు అదనంగా మొలిచాయి. వూళ్లోవాళ్లు హాహాకారాలు చేస్తుండగా, నారాయణ సంభ్రమంగా చూస్తుండగా వీరేశ్ నాలుగు చేతులతో వీరగల్లును ఎత్తుకొని నడక ప్రారంభించాడు. క్షణాల్లో వూళ్లో వాళ్లు చాలామంది అతని వెంట నడక ప్రారంభించారు. వూర్లు దాటుకుంటూ వెళ్తున్నాడు వీరేశ్. మరో నాలుగురోజుల్లో పది వూర్లవాళ్లు అతని వెంట నడవడం ప్రారంభించారు. యిప్పుడు వీరేశ్ ఆరు చేతులవాడయ్యాడు. ఆ వింతను చూస్తూ దిగ్భ్రాంతితో వూర్లు వూర్లు సిద్ధేశ్వరం వైపు నడుస్తున్నాయి. ఎనిమిదో రోజుకు వీరేశ్‌కు ఎనిమిది చేతులు మొలిచాయి. అతని వెంట వేలాదిగా జనం వస్తున్నారు. 'సిద్ధేశ్వరం

రాయలసీమ వెలుగు,' అంటున్నారు. 'కృష్ణాజలాలు రాయలసీమ హక్కు,' అంటున్నారు.

దావానలంలాగా పాకిన వార్తలతో ఆ ప్రాంతం అల్లకల్లోలమైంది. ఏమిటీ అరాచకం అనుకునేవాళ్లు అడ్డుకుందామని ఎదురువెళ్లారు. పన్నెండోరోజుకు వీరేశ్‌కు పది చేతులు మొలిచి వీరగల్లును అవలీలగా మోస్తూ శ్రీశైలం ముంపు భూముల్లో సాగిపోతున్నాడు. 'అడుగు అడుగు సిద్ధేశ్వరం అలుగు,' అంటున్నది అతని వెనుక జనసముద్రం.

కరువుపీడిత జనాలకు యిన్ని నీళ్లు తోడుకోవడానికి కృష్ణలో చిన్న అలుగు నిర్మాణానికి వెళ్తున్న యీ వీరగల్లుకు ఎదురుగా కొందరు ఖాకీ జెండాలూ, పచ్చ జెండాలూ వూపుకుంటూ, ఆగమని అరుస్తూ, బెదిరిస్తూ దారిలో కందకాలు తవ్వుతున్నారు. వాళ్లను చూస్తూ నిలబడిపోయాడు నారాయణ.

'ఒక చిన్న ప్రతిఘటన పది చేతులు మొలిచిన వుద్యమం ఎదురుగా. ఆపగలదా! కాలమే నిర్ణయిస్తుంది,' అనుకున్నాడు నారాయణ.

*అరుగు అంతర్జాల పత్రిక*
*మార్చి 2016*

*



28 మే 1965న కర్నూలు జిల్లాలో జన్మించిన జి. వెంకటకృష్ణ మొదటి కథ **పామును మింగిన కప్ప** 1994లో ఆంధ్రప్రభలో అచ్చయింది. *గరుడస్తంభం, చిలకలు వాలిన చెట్టు, దేవరగట్టు* కథాసంపుటాలు, మూడు కవితా సంపుటాలు, ఒక దీర్ఘకవిత ప్రచురించారు. *కథా సమయం, హంద్రీ కథలు* సంకలనాలకు సహ సంపాదకులు. కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం.

***చిరునామా: 87-1287-1, సోమిసెట్టి నగర్, కర్నూలు - 518 002.***
***ఫోన్: 94412 87865 venkatakrishna838@gmail.com***